
శిష్యశతకము




గురుసహస్రావధాని

డా॥ కడిమిళ్ళ వరప్రసాద్



మనసంతా పూలతేరు మాటలలో శ్రుతుల సౌరు
చూపులలో పన్నీరు వెదరుపాక గాడ్బుగారు

- అంకితం -



తల్లిదండ్రులు

శ్రీ వేంకటరామయ్యశాస్త్రి & శ్రీమతి భారతి

శిష్యశతకము

గురుసహస్రావధాని

డా. కడిమిళ్ళ వరప్రసాద్

శిష్యశతకము

రచన
గురుసహస్రావధాని
డా. కడిమిళ్ళ వరప్రసాద్
3.6.50. యళ్ళమిల్లివారి వీథి

దూరవాణి. 08814-274876
చరవాణి. 9247879606
email. kadimilla@yahoo.com
kadimillavaraprasad@gmail.com
website.. www.kadimilla.com
www.kadimella.com

ప్రచురణ... 2013

ప్రతులు... 1000

వెల... 40 రూ.లు

ప్రతులకు
కె. రమేష్
3.6.50, యళ్ళమిల్లివారి వీథి
నరసాపురం.
పశ్చిమగోదావరి జిల్లా

ముద్రణ
సాయితేజ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
మెయిన్‌రోడ్, నరసాపురం. 534275
సెల్. 9346633812, 9247347626

ఈ శతకం ఎందుకు పుట్టిందంటే!

నేను రమారమి మూడు దశాబ్దాలుగా నరసాపురం టేలరున్నత పాఠశాలలో తెలుగుపండితునిగా పని చేస్తున్నాను. ఎందరో విద్యార్థులు నా దగ్గఱ చదువుకొని వారు ఏర్పరచుకొన్న జీవికలతో సుఖంగా జీవిస్తున్నారు. అప్పుడప్పుడు కొందరు వచ్చి, నమస్కరించి, నేను మీ దగ్గరే చదువుకొన్నామని చెపుతుంటారు. కొందరిని గుర్తు పట్టగలుగుతాము. కొందరిని గుర్తు పట్టలేక అలాగా! అంటాము. ఇది అందరు ఉపాధ్యాయులకూ కలిగే అనుభవమే. అదిగాక నేను సాహిత్యరంగంలో కవిగానూ, అవధానిగానూ లోకానికి పరిచయమైన వ్యక్తినే. జీతాలు తీసుకొంటూ ఎందరో శిష్యులకు విద్యాబుద్ధులు నేర్పిన నేను, ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా ఈ రంగంలోకూడా ఎంతోమందిని తీర్చి దిద్దాను. వారిలో కవులున్నారు. కవయిత్రులున్నారు. అవధానులున్నారు. వారందరూ సాహితీరంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగారు.

2013 మార్చి 18, 19 తేదీలలో మా పాఠశాల పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సభ జరిపి, గురువులనందరినీ సత్కరించారు. నాకొక భావావేశం కలిగింది. నా యీ శిష్యులకందరికీ జీవితంలో గురువులయెడ, అలాగే లోకంలోనూ ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో చెపుతూ ఒక పద్యశతకాన్ని వ్రాస్తే బాగుంటుందనిపించింది. అనిపించినదే తడవు కలం అందుకొన్నాను. అంతే నిన్న సగం, ఈరోజు (20మార్చి 2013) సగం, రెండే రోజులలో శతకం పూర్తయింది. ఈ రోజు సాయంత్రం ఆరుగంటలకు శతకం వందవ పద్యం పూర్తయింది. వెంటనే కంప్యూటరుముందు కూర్చుని శతకాన్ని డి.టి.పి చేయడం మొదలుపెట్టాను. నేను తెలుగు ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ భాషలలో డి.టి.పి చేయడం అలవాటు చేసికొన్నాను. అందుకనే నా రచనలన్నీ నేనే స్వయంగా డి.టి.పి చేసికొని ఈమెయిలు ద్వారా ప్రెస్సుకి పంపిస్తాను. వారు దానిని ప్రింటు చేస్తారు. దీనివల్ల ప్రూఫ్ రీడింగ్ బాధలేదు. ఒకవేళ ఏవైనా క్వాచిత్కంగా అక్షరదోషాలు దొర్లి ఉంటే అవి నావే కాని, ప్రెస్‌వారికి ఎటువంటి సంబంధం లేదు.

అందంగా సకాలంలో ముద్రించి ఇచ్చిన సాయితేజ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి, నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, జ్ఞానాన్ని ప్రసాదించి నన్ను కవిగా అవధానిగా పండితునిగా తీర్చిదిద్దిన గురుదేవులకు, నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించే నా కుటుంబసభ్యులకు, మిత్రులకు ధన్యవాదాలు.

- డా. కడిమిళ్ళ వరప్రసాద్

శిష్యశతకము

1. శ్రీరామునివలె నుండుము
పోరాటము సేయబోకు పూజ్యులతోడన్
నోరార నిజము పలుకుమ
యారును నూరైన కల్లలాడకు శిష్యా!

తా. శిష్యా! శ్రీరామునిలా ఉండు. పెద్దవారితో పోట్లాడకు. నోరారా నిజమే మాట్లాడు. ఆరు నూరైనా అబద్ధాలు మాత్రం చెప్పకు.

2. గురువే చనవు నొసంగిన
బరమాదరమంచు నీవు భావింపవలెన్
గురుజనములతో జనవుగ
బొరబాటునగూడ మసలబోకుము శిష్యా!

తా. శిష్యా! గురువు నీకు చనవునిచ్చినచో అది పరమాదరము అని భావించాలి. అలాగని గురువుకు సంబంధించిన జనములతో చనవుగా పొరబాటునకూడా ప్రవర్తించకూడదు.

3. గురువులతో వైరమ్మును
బొరబాటున గూడ నీవు పూనకుమయ్యా
గురుదూషణ సేయకుమా
గురువేదన బ్రతుకునెల్ల గూల్చును శిష్యా!

తా. శిష్యా! పొరబాటునగూడా గురువులతో ఎపుడూ విరోధం పెట్టుకోకు. గురువులను నిందించకు. అలా చేస్తే వారి మనసు బాధపడితే ఆ వేదన నీ బ్రతుకును కూల్చేస్తుంది.

4. నేరములు చెప్పబోకుము
నేరములెవరేని జెప్పనేర్చినయెడలన్
వారిని విడువగవలయును
వారే మంథరలు కూల్చివైతురు శిష్యా!

తా. శిష్యా! ఎవరిగురించి ఎవరితోనూ నేరాలు చెప్పకు. ఎవ్వరైనా నీకు ఇతరులగురించి నేరాలు చెపుతుంటే వారిని విడిచిపెట్టేయాలి. వారే మంథరలాంటివారు. జీవితాలను కూల్చేస్తారు.

5. అపకారికి నుపకారము
నెపమెన్నక సేయుమన్న నీతిని వినవే
యుపకారికి పూనికతో
నపకారము సేయువాడె యధముడు శిష్యా!

తా. శిష్యా! అపకారికికూడా ఉపకారం చేయమని సుమతీ శతకంలో చెప్పిన నీతిని విన్నావు కదా! అటువంటిది ఉపకారికే అపకారం చేస్తే అతడే నీచుడు

6. ఉల్లమునందు గృతజ్ఞత
యుల్లసిలినవాడె పూజ్యుడుర్వీస్థలిలో
ద్రెళ్ళును గృతఘ్నుడూరక
యల్లరిపాలౌను సంఘమందున శిష్యా!

తా. శిష్యా! మనసులో కృతజ్ఞత అనే గుణం ప్రకాశించేవాడే ఈ భూమిలో పూజ్యుడౌతాడు. ఉపకారికి తిరిగి అపకారం చేసిన కృతఘ్నుడు సంఘంలో అల్లరిపాలౌతాడు. నశించిపోతాడు.

7. తల్లికి దండ్రికి గురునకు
గల్లలు వచియించి చేటు గావించినచో
జెల్లును నూకలు కీర్తికి
జిల్లర బ్రతుకౌను ముసురు జీకటి శిష్యా!

తా. శిష్యా! తల్లిదండ్రులకు, గురువునకు అబద్ధాలు చెప్పి, వారికి చేటు కలిగిస్తే అతగాడి కీర్తికి నూకలు చెల్లిపోతాయి. వాడి బ్రతుకు చిల్లరబ్రతుకైపోతుంది. వాడి జీవితంలో చీకట్లు ముసురుకుంటాయి.

8. చెడు వినకుము, చెడు గనకుము
చెడు ననకుము చెడ్డవారి స్నేహము విడుమా
చెడునాదరించువారికి
జెడిపోవును జిత్తశాంతి శీఘ్రము శిష్యా!

తా. శిష్యా! చెడు వినవద్దు. చెడు చూడవద్దు. చెడు మాట్లాడవద్దు. చెడ్డవారితో స్నేహాన్ని విడిచిపెట్టు. చెడును ఆదరించినవారికి వెంటనే మనశ్శాంతి చెడిపోతుంది.

9. నలుగురిలో నగుబాటును
గలిగించెడి పనులు చేయగా జనదు సుమా
కలుషితమౌ బ్రతుకంతయు
మలినమ్మై కీర్తిగూడ మాయును శిష్యా!

తా. శిష్యా! నలుగురిలో నవ్వులపాలయ్యే పనులు చేయకు. దానివల్ల బ్రతుకంతా కలుషితమైపోతుంది. కీర్తికూడా మలినమై మాసిపోతుంది.

10. గాయము కారాదుసుమా
నీ యునికిని నొరుల మనసు నీ పలుకులచే
గాయపడిన యా మనసే
పాయని కర్మమ్ము విడని పాశము శిష్యా!

తా. శిష్యా! నీవల్ల ఇతరుల మనసు గాయపడకూడదు. నీ పలుకులవల్ల గాయపడిన ఆ మనసే వదలని కర్మమై, విడిచిపెట్టని పాశమై పట్టుకొంటుంది.

11. పోరైనను బొందైనను
నోరే మూలమ్ము సుమ్ము నోరే త్రుంచున్
నోరే పెంచును గావున
దూరికి దూరికిని మాట తూలకు శిష్యా!

తా. శిష్యా! పోరైనా, పొందైనా అన్నిటికీ నోరే మూలం. త్రుంచేదీ, పెంచేదీ నోరే కనుక మాటి మాటికీ మాట తూలకు.

12. మనవారు మెచ్చుకొనిరని
మన చేసెడి యెల్లబనులు మంచివి యగునా
మన పనిని యెల్లరును మె
చ్చినయపుడే మంచి, కాక చెడుగే శిష్యా!

తా. శిష్యా! మనవారు మెచ్చుకున్నంతమాత్రాన మనం చేసే పనులన్నీ మంచివి కావు. మన పనిని అందరూ మెచ్చుకొంటేనే మంచి. కాకపోతే అది చెడే.

13. నిను దీర్చి దిద్దువారల
మనములనే గాయపఱచి మసలితివేనిన్
నిను నీవు త్రుంచుకొనుటే
యనలముతో గూడి యాటలాడుటె శిష్యా!

తా. శిష్యా! నిన్ను తీర్చి దిద్దేవారి మనసులనే గాయపరిస్తే నిన్ను నీవు త్రుంచుకోవడమే. అగ్నితో ఆటలాడటమే.

14. నిను నమ్మిన నీ నమ్మిన
జనములతో గోరి కోరి జగడములాడన్
బనిపూనితివన్న యెడన్
నిను నీవే కూల్చుకొనుట నిజముగ శిష్యా!

తా. శిష్యా! నిన్ను నమ్మినవారితోనూ, నీవు నమ్మినవారితోనూ కావాలని గొడవలు పెట్టుకోవడం మొదలుపెట్టావంటే నిన్ను నీవే కూల్చుకోవడం. ఇది నిజం.

15. వంచన సేయకుమెపుడున్
వంచకులను మించి పరమపాపులు గలరే
అంచితులగు గురువులనే
వంచించుట జన్మమునకు భ్రష్టత శిష్యా!

తా. శిష్యా! ఎవరినీ మోసగించకు. మోసం చేసేవారికంటే మహాపాపులు లేరు. అందునా పూజ్యులైన గురువులనే వంచిస్తే అది జన్మకే భ్రష్టత్వం. (దిగజారుడుతనం)

16. నీకున్ గీర్తి నొసంగెడి
వాకుల నందించువాని వదలకుమెపుడున్
జీకటిని బాఱద్రోలుచు
నీకై వెలుగిచ్చువాని నెట్టకు శిష్యా!

తా. శిష్యా! నీకు కీర్తిని పెంచే అక్షరజ్ఞానాన్ని ఎవరు అందించారో వారిని ఎప్పుడూ వదలకు. అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టి నీకోసం వెలుగులు నింపే గురువును నెట్టివేయకు.

17. గురువులను బిలువకుండగ
బరమేశ్వర పూజసేసి పావనుడగునే
హరునిం గాదని దక్షుడు
తిరమగు నపకీర్తి గొనియె దెలియుము శిష్యా!

తా. శిష్యా! ఎవరెవరినో పిలిచి, గురువును మాత్రం పిలువకుండగా పరమేశ్వరుని పూజలు చేస్తే అతడు పవిత్రుడౌతాడా? శివుని తిరస్కరించి యజ్ఞం చేసిన దక్షుడేమి బావుకున్నాడు శాశ్వతమైన అపకీర్తి తప్ప.

18. వంచకుడగువాడే విధి
వంచితుడైపోవు బ్రతుకు పాడైపోవున్
మంచిని నటియించినచో
పొంచిన కాలమ్ము పుట్టి ముంచును శిష్యా!

తా. శిష్యా! ఎవరైనా ఇతరులను వంచిస్తే దైవం వానిని వంచిస్తుంది. మంచివానిలాగా నటిస్తే పొంచియున్న కాలం ఏదో ఒకనాడు అతని పుట్టి ముంచుతుంది.

19. దాసుడనని పల్కుచునే
మోసము గావించువాడు పుడమికి బరువై
క్లేశములకు బాత్రమ్మై
గాసిలు నపకీర్తి గొనును గదరా శిష్యా!

తా. శిష్యా! నీ దాసుడినంటూ అతివినయాన్ని చూపించి, మోసం చేసేవాడు భూమికే బరువైపోతాడు. కష్టాలకు పాత్రుడౌతాడు. చెడిపోతాడు. అవకీర్తిని సంపాదించుకొంటాడుగదా!

20. మైత్రిని నిజాయితీకే
ఛత్రమ్మును బట్టునట్లు సాగింపవలెన్
ధాత్రిని నిజాయితీకి ల
విత్రమ్మై బ్రదుకనేల వినుమా శిష్యా!

తా. శిష్యా! విను. స్నేహాన్ని నిజాయితీకి గొడుగుపట్టినట్లు సాగించాలి. నిజాయితీని తెగగోసే కొడవలిలాగా బ్రతురాదు

21. గురునకు జెప్పగరాదని
పొరబాటునగూడ బల్కబోకుము సుమ్మా
చిరకాలము దాగదులే
గురుశిష్యుల బంధమపుడు కూలును శిష్యా!

తా. శిష్యా! ఈ విషయం గురువుగారికి చెప్పవద్దని ఎవ్వరితోనూ పొరబాటునకూడా పల్కకు. నిజం ఎన్నాళ్ళో దాగదు. అసలు విషయం బయటపడిననాడు గురుశిష్యబంధమే కూలిపోతుంది.

22. తప్పొప్పుకొనెడివాడే
యిప్పుడమిని ధన్యజీవి యెందేనెపుడేన్
తప్పు సమర్థించుకొనెడి
తప్పుడు మానిసికి బ్రతుకు దండుగ శిష్యా!

తా. శిష్యా! తప్పులు చేయడం సహజం. కాని ఆ తప్పును తప్పుగా ఒప్పుకొనేవాడే ధన్యజీవి. కాదని తప్పును ఒప్పుగా సమర్థించుకొనేవాడి బ్రతుకే దండుగబ్రతుకు.

23. గురుభూషణమే పుణ్యము
గురుదూషణపరుడు పాపకూపము పాలౌ
గురుసత్కారము శ్రేయము
గురుధిక్కారమున బ్రదుకు కూలును శిష్యా!

తా. శిష్యా! గురువును భూషించడం పుణ్యం. గురువును దూషించువాడు పాపకూపంలో (పాపమనే నూతిలో) పడిపోతాడు. గురువును సత్కరిస్తే క్షేమం కలుగుతుంది. గురువుని ధిక్కరిస్తే బ్రతుకే కూలిపోతుంది.

24. పెట్టిన చేతులనే తెగ
గొట్టెడివాడెంతపాటి కోవిదుడైనన్
ముట్టడతని పూజలు హరు
డట్టిట్టననేల యాతడధముడు శిష్యా!

తా. శిష్యా! పెట్టిన చేతులనే ఎవడు తెగగొడతాడో అటువంటివాడు ఎంతగొప్ప పండితుడైనా వాని పూజలు పరమేశ్వరుడు ముట్టడు. ఏదేదో అననక్కరలేదు. ఒక్కమాటలో అటువంటివాడు అధముడు.

25. చెప్పుడుమాటలు విని తన
గొప్పతనము మూలమైన గురుని దెగడుచో
తిప్పలు తప్పవు సుమ్మీ
తప్పొప్పులు తెలియువాడె ధన్యుడు శిష్యా!

తా. శిష్యా! ఎవడైతే చెప్పుడుమాటలు విని తన గొప్పతనానికి మూలమైన గురువునే నిందిస్తాడో అటువంటివాడికి తిప్పలు తప్పవు. ఇది తప్పు, ఇది ఒప్పు అని గ్రహించినవాడే ధన్యుడు.

26. పెద్దలనెదిరింపకుమా
యొద్దికగా వారు చెప్పు సూక్తులు వినుమా
పెద్దలు చెప్పిన మాటయె
చద్దన్నపు మూట యనుట సత్యము శిష్యా!

తా. శిష్యా! ఎప్పుడూ పెద్దవారిని ఎదిరించకు. జాగ్రత్తగా వారు చెప్పే మంచిమాటలు విను. పెద్దల మాట చద్దన్నపు మూట అన్నది సత్యం.

27. మంచితనమ్మును మించిన
కంచెను నీ జీవితమున గనగలవటవో
మంచికి జరిగిన వంచన
పొంచిన పెనుబాము వదలబోదది శిష్యా!

తా. శిష్యా! మంచితనాన్ని మించిన కంచెను నీ జీవితంలో చూడలేవు. మంచికి గనుక వంచన జరిగితే అది పెద్దపాముగా మారుతుంది. అది నిన్ను వదలదు.

28. పెఱవారల మెప్పునకై
సరివారల దెగడువాడు జాల్మండవనిన్
గరిక తిని చెడును గాడిద
పరుషమ్ములనాడు వాడె పాడగు శిష్యా!

తా. శిష్యా! పరాయివారు ఏదో చెప్పారని సాటివారిని తిట్టిపోసేవాడు మూర్ఖుడు. గరిక తిన్న గాడిదే పోతుంది. గరికకేముంది మళ్ళీ మొలుస్తుంది. అన్యాయంగా తిట్టినవాడే చెడిపోతాడు గాని పడ్డవాడు చెడ్డవాడు కాదు.

29. నీవారెవరో తెలియుము
సావాసము వారితోడ సాగింపుమయా
నీవారు కానివారల
కై వంచన నేర్చి, చెడుట ఖాయము శిష్యా!

తా. శిష్యా! ఎవరు నీవారో తెలుసుకో. వారితోనే స్నేహాన్ని సాగించు. పరాయివారికోసం నీవారిని వంచిస్తే చెడిపోవడం తప్పదు.

30. నిను నమ్మి నీకు విద్యా
ధనమిచ్చినవారియెడల ధర్మపరుడవై
కొనసాగుమ, యవ్వారల
కనుసన్నలయందు మసలగావలె శిష్యా!

తా. శిష్యా! నిన్ను నమ్మి, నీకు విద్యాధనాన్ని ఇచ్చినవారి విషయంలో ధర్మంగా ప్రవర్తించు. వారి కనుసన్నలలో మసలుకో.

31. నిను గురువులు తిట్టినచో
నిను దిద్దుటకొఱకె గాని నీపై ద్వేష
మ్మును బూనుట కాదను భా
వన వేయును నీకు బూలబాటను శిష్యా!

తా. శిష్యా! నిన్ను నీ గురువులు తిడితే అది నిన్ను తీర్చి దిద్దడానికే తప్ప నీ పై ద్వేషంతో కాదనే భావన నీకు కలిగితే అదే నీ జీవితానికి పూలబాట వేస్తుంది.

32. మన తలపులలో నున్నదె
మన మాటలయందుగూడ మసలగవలయున్
మన మాటలు చేతలలో
కనిపించిన నాడె కీర్తి కలుగును శిష్యా!

తా. శిష్యా! మన ఆలోచనలో ఏముందో అదే మాటలలో వినబడాలి. ఏం మాట్లాడుతున్నామో అదే చేతలలో కూడా కనబడాలి. అప్పుడే కీర్తి లభిస్తుంది.

33. మలినాటి చెలిమికొఱకై
తొలినాళులవారినుండి తొలగుట తగునే
నెలనడిమినాటి వెన్నెల
వెలుగులకై రవిని విడిచి వెళ్ళకు శిష్యా!

తా. మధ్యలో ఏర్పడిన స్నేహంకోసం మొదటినుంచీ ఉన్నవారికి దూరంగా వెళ్ళిపోవడం తగని పని. నెల మధ్యలో పూర్ణిమనాడు వచ్చే వెన్నెల వెలుగుకోసమని నిత్యం వెలుగులనందించే సూర్యుణ్ణి వదిలి వెళ్ళకు. (చంద్రునికికూడా ఆ సూర్యునివల్లే వెలుగు తప్ప అతడు స్వయంప్రకాశకుడు కాడు)

34. మెఱమెచ్చులు పల్కుటయో
మెఱమెచ్చులు పల్కు జనుల మెచ్చుకొనుటయో
కొఱమాలినతనము సుమీ
వెఱవవలయు ధర్మమునకు వినుమా శిష్యా!

తా. శిష్యా! లోపల ఎలా ఉన్నా పైకిమాత్రం తీయగా మాట్లాడటం, అలా మాట్లాడేవారిని మెచ్చుకొని ప్రోత్సహించడం పనికిమాలినతనం. ఎవరికీ భయపడకపోయినా ధర్మానికి మాత్రం భయపడాలి.

35. నిను బెంచినవార్తలపై
కినుకను వహియింపుమనుచు గిల్లినవారే
నిను జెడగొట్టెడి మానిసు
లని తెలియుము చిత్తశాంతినందుము శిష్యా!

తా. శిష్యా! ఎవరు నిన్ను పెంచి పెద్ద చేసి, లోకంలో కీర్తిప్రతిష్ఠలు సంపాదించడానికి మూలమయ్యారో అటువంటివారితోనే కలహం పెట్టుకొనే విధంగా ఎవరైతే నిన్ను గిల్లుతున్నారో వారే నిన్ను చెడగొట్టేవారని గ్రహించు. అప్పుడే నీకు మనశ్శాంతి కలుగుతుంది.

36. ఆవేశమ్మె యనర్థం
బావేశము చంపివేయు నాలోచనలన్
ఏవిషయమేనినెమ్మది
గా వీక్షించిన మనీషి గాదగు శిష్యా!

తా. శిష్యా! ఆవేశమే అనర్థం. ఆవేశం ఆలోచనలను చంపేస్తుంది. ఏ విషయాన్నైనా నెమ్మదిగా పరిశీలించినవాడే తెలివైనవాడవుతాడు.

37. పరుషమ్ములాడి యెఱుగని
సరసుని దుర్భాషలాడ సమకట్టిన నా
దురితమ్ము త్రాచుపామై
బిరబిరమని వచ్చి కాటువేయును శిష్యా!

తా. శిష్యా! ఎప్పుడూ ఎవరినీ ఒక్క పరుషవాక్యంకూడా పలికి దూషించడం ఎఱుగని మంచివానిని నోటికి వచ్చినట్లు తిడితే ఆ పాపం త్రాచుపామై వేగంగా వచ్చి కాటువేస్తుంది జాగ్రత్త.

38. ఇరువురు ప్రాణస్నేహితు
లరులై పోట్లాడుకుందు రన్యులవలనన్
బరులు వచించు నసత్యము
గురి తప్పని శరము గ్రుచ్చుకొనునో శిష్యా!

తా. శిష్యా! ఇతరుల వల్ల ఇద్దరు ప్రాణస్నేహితులు శత్రువులుగా మారిపోయి పోట్లాడుకుంటారు. అందుకు కారణం పరులు చెప్పే అసత్యాలే. వారు చెప్పే కల్లలు నమ్మకూడదు. ఆ అసత్యం గురితప్పని బాణమై గ్రుచ్చుకుంటుంది.

39. తప్పును దప్పని యొప్పుగ
జెప్పంగా లేనివాడు స్నేహితుడగునా
తప్పైనను నొప్పేయని
గొప్పగ కర్ణుండు పలికి కూలడె శిష్యా!

తా. శిష్యా! తప్పును తప్పని మోమోట లేకుండా చెప్పలేనివాడు స్నేహితుడు కాడు. దుర్యోధనుడు చేసే తప్పులన్నీ ఒప్పులే యని సమర్థించిన కర్ణుడు కూలిపోలేదా!

40. గురుభక్తి కలిగియుండుము
గురుజనములతోడ జనవు కూడదు సుమ్మా
గురువును బిలువని చోటికి
గురుజనముల నెపుడు బిలువకూడదు శిష్యా!

తా. శిష్యా! గురుభక్తి కలిగి ఉండాలి. గురువుకు సంబంధించినవారితో ఎక్కువ చనవుగా ఉండకూడదు. ఏ కార్యక్రమానికైనా గురువును పిలువకపోతే అక్కడికి గురువుగారి జనాలనుకూడా పిలువకూడదు.

41. గురువుపయి నెల్లవేళల
గురి యుండగవలయుగాని గురుహృదయమ్మున్
గురిపెట్టి, పలుకుటమ్ములు
వరుసగ విడనాడువాడు భ్రష్టుడు శిష్యా!

తా. శిష్యా! గురువుమీద ఎపుడూ గురి(విశ్వాసం) ఉండాలిగాని, గురువుగారి హృదయాన్నే గురిపెట్టి, పలుకుల బాణాలను వరుసగా విడిచిపెట్టేవాడు భ్రష్టుడైపోతాడు.

42. గురునకు గల్లలు చెప్పుట
గురువునకున్ నిజము చెప్పకూడదటంచున్
బరులను బ్రేరేపించుట
కొఱివిని గొని తలను గోకికొనుటే శిష్యా!

తా. శిష్యా! గురువునకు అబద్ధాలు చెప్పడం గాని, గురువునకు నిజం చెప్పద్దని ఇతరులను ప్రోత్సహించడం గాని, కొఱివితో తల గోక్కోవడమే తప్ప వేరుగాదు.

43. విజ్ఞానపు దివ్వియనిడి
యజ్ఞానపు టిరులు ద్రోయు నార్యు నవజ్ఞా
యజ్ఞ బలిపశువు జేసెడి
ప్రజ్ఞావంతుండు బాగుపడడుర శిష్యా!

తా. శిష్యా! విజ్ఞానమనే దివ్వెనిచ్చి, అజ్ఞానమనే చీకట్లను పారద్రోలిన పూజ్యుణ్ణే తిరస్కారమనే యజ్ఞానికి బలిపశువుగా చేసేవాడు ఎంత తెలివైనవాడైనా బాగుపడడు.

44. తన చారిత్రము తప్పిన
గని హితమును బల్కినట్టి క్రమమనస్కున్
వినరాని దారుణోక్తుల
ననువానికి నిహము పరము నంటవు శిష్యా!

తా. శిష్యా! తప్పుడు నడత కలిగినవానిని చూచి, ఎవరైనా మంచివాడు హితం పలికితే, అతని మాట వినకపోగా వినరాని దారుణమైన మాటలతో తిరిగి దూషించేవాడికి ఈలోకంలోనూ, పరలోకంలోనూకూడ శ్రేయస్సు కలుగదు.

45. విశ్వాసఘాతుకునకున్
విశ్వమ్మున జోటులేక వెలివేయబడున్
నశ్వరమగు దేహమ్మిది
శాశ్వత దుష్కర్మ చేయ జనకుము శిష్యా!

తా. శిష్యా! నమ్మినవారినే మోసం చేసినవానికి ఈ ప్రపంచంలోనే చోటులేకుండా వెలివేయబడతాడు. ఈ శరీరం అశాశ్వతమైనది. దీనిని నమ్ముకొని ఎన్ని జన్మలెత్తినా వదలకుండా శాశ్వత కర్మరూపంలో వెంటాడే పాడుపనులు చేయకు.

46. మిత్రఘ్నుడు దుర్గతికిం
బాత్రుండగు వాని జన్మ భ్రష్టంబె యహెూ
రాత్రములు తపము చేసియు
నా త్రిణయను మెప్పునందడాతడు శిష్యా!

తా. శిష్యా! ఎవడైతే స్నేహితునుకి ద్రోహం చేస్తాడో వాడు దుర్గతిని పొందుతాడు. వాడి జన్మ భ్రష్టమైపోతుంది. అటువంటివాడు రాత్రింబగళ్ళు తపస్సు చేసినా ముక్కంటియైన ఈశ్వరుడు మెచ్చుకోడు.

47. శివసంకల్ప విహీనుడు
శివపూజనములను జేసి శ్రేయము గొనునే
భువియే మెచ్చని శఠునిన్
శివుడెవ్విధి మెచ్చుకొనును జెపుమా శిష్యా!

తా. శిష్యా! ఎవడికి మంచి సంకల్పం ఉండదో అటువంటివాడు శివపూజలు చేసినా క్షేమాన్ని పొందగలడా! ఈ లోకం మెచ్చని మోసగాడిని శివుడుమాత్రం ఎలా మెచ్చుకుంటాడు చెప్పు.

48. పలికినదాచరణమ్మున
నిలబడకుండినను వాని నిష్ఠాభినయం
బులు జనము నమ్మవచ్చును
గలనైనను శివుడు నమ్మగలడా! శిష్యా!

తా. శిష్యా! చెప్పే నీతులు ఆచరణలో లేకపోతే నియమబద్ధంగా జీవిస్తున్నవాడిలా నటిస్తే ఆ నటన ప్రజలు నమ్మవచ్చేమో గాని కలలోకూడా పరమేశ్వరుడు నమ్మడుగదా (ఇతరులెఱుగకున్న నీశ్వరుడెఱుగడా. వేమన)

49. తలపులు వేఱుగనుండును
బలుకులు వేఱుగనె యుండు బనులును వేఱౌ
బలిమిని త్రికరణశుద్ధిని
బలిపెట్టినవాని బ్రదుకు బండయె శిష్యా!

తా. శిష్యా! తలచేది ఒకటి. పైకి చెప్పేది వేఱొకటి. చేసేది ఇంకొకటి. ఇలా బలవంతంగా మనోవాక్కాయకర్మల శుద్ధిని బలిపెట్టే వాడి బ్రతుకు బండబారిపోయినట్లే.

50. తాత్కాలిక సుఖములకై
సత్కారార్హునిగ జేయు సద్గురువులనే
చీత్కారంబొనరించుట
సత్కార్యము గాదు వాడు జడుడే శిష్యా!

తా. శిష్యా! క్షణికమైన సుఖాలకోసమని సత్కారాలు పొందే అర్హతను కల్పించిన మంచిగురువులనే చీకొట్టడం ధర్మం కాదు. అటువంటివాడు వివేకం లేని జడపదార్థం లాంటివాడు.

51. భగవంతుడు తనకిచ్చిన
యగణితమగు నిధికి గురున కవమానమ్మున్
బగబట్టి చేయువానికి
దగిన ఫలితమిచ్చి తీరు దైవము శిష్యా!

తా. శిష్యా! గురువంటే భగవంతుడు ప్రసాదించిన సాటిలేని నిధి. అటువంటి గురువును పగబట్టి మఱీ అవమానిస్తే అటువంటివానికి దైవం తప్పకుండా తగిన ఫలితమిచ్చి తీరుతుంది.

52. కళలో నెదిగినవానికి
నిలలో జనులెల్ల మెత్తురెవ్వరినేనిన్
కళలో బ్రావీణ్యమ్మును
గలిగించిన వాని విడువ గాదుర శిష్యా!

తా. శిష్యా! ఏదైనా ఒక కళలో నైపుణ్యాన్ని సంపాదించి ఎదిగిన వానిని ప్రజలందరూ మెచ్చుకొంటారు. అటువంటి కళలో నీకు ప్రావీణ్యాన్ని అందించినవానిని విడిచిపెట్టగూడదు.

53. గురువులపై నేరమ్ములు
వరుసగ వచియించునట్టివారెల్లరు నీ
చరితముపై గురిపెట్టిన
గరళశరములనుచు దెలియగావలె శిష్యా!

తా. శిష్యా! ఎవరైతే నీ గురువులపై నీకే వరుసగా నేరాలు చెపుతుంటారో అటువంటివారు నీ చరిత్రమీద గురిపెట్టిన విషపుబాణాలని గ్రహించు.

54. బడి గొప్పది, బడినేర్పిన
నుడి గొప్పది, నుడిని నీకు నూరిన గురుడా
బడికంటెను, నుడికంటెను
బొడవు కలుగువాడు పరమ పూజ్యుడు శిష్యా!

తా. శిష్యా! బడి గొప్పది. ఆ బడి నీకు నేర్పిన నుడి(అక్షరజ్ఞానం) గొప్పది. ఆ నుడిని నీకు నూరిన (క్షుణ్ణంగా చెప్పిన) గురువు బడికంటే నుడికంటే కూడా చాల ఉన్నతమైనవాడు, మిక్కిలి పూజ్యుడు.

55. విరసములు పల్కబోకుము
సరసమ్ముగ మాటలాడు శాంతునియందే
నిరతము దైవమ్ముండును
మురియును లోకమ్ము వాని మ్రోలను శిష్యా!

తా. శిష్యా! విరసంగా (అవతలివారి మనసు బాధపడేలా) మాట్లాడకు. సరసంగా (ఎదుటివారి మనసు ఆనందపడేలా) మాట్లాడే శాంతపరునియందే నిత్యం భగవంతుడు కొలువుంటాడు. లోకంకూడా అటువంటివాడు ఎదురుగా ఉన్నపుడు లోకం ఎంతో మురిసిపోతుంది.

56. నీకుం గీర్తి లభించిన
నా కీర్తికి మూలమైన యాప్తునకెపుడున్
జీకాకులు కలిగింపకు
మేకరణిని నేని నెప్పుడేనియు శిష్యా!

తా. శిష్యా! నీకు మంచి పేరు, ప్రతిష్ఠ ఏర్పడితే ఆ కీర్తికి ఎవరు మూలమో అటువంటి అప్తుడి మనసు గాయపడే పనులు ఎప్పుడూ ఏ విధంగానూ చేయకు.

57. దుడుకుతనమ్మును జూపకు
మడుగడుగున మంచి నడత యవసరము సుమా
నుడి తూలిన జీవితమే
గడబిడయై గాడితప్పు గదరా శిష్యా!

తా. శిష్యా! దూకుడుగా ప్రవర్తించకు. అడుగడుగునా మంచి నడవడి చాలా అవసరం. మాట తూలితే జీవితమే చెదిరిపోయి గాడి తప్పుతుంది.

58. చెడుపల్కులాలకించిన
చెడిపోవును నీదు నడత చెడు జీవితమే
చెడకుండగ జీవించుము
చెడుమానిసితోడ జెలిమి చేయకు శిష్యా!

తా. శిష్యా!చెడ్డమాటలు వింటె నీ ప్రవర్తన చెడిపోతుంది. తరువాత నీ జీవితమే చెడిపోతుంది. అలా చెడకుండా జీవించు. చెడ్డమనుజునితో స్నేహం చెయ్యకు.

59. నాలుకకు నరము లేదని
తేలికగా గల్లలాడు తీరును విడుమా
నాలుకయే తలగాచును
నాలుకయే తలను గొట్టు నమ్ముము శిష్యా!

తా. శిష్యా! నాల్కకు నరం లేదుకదా అని తేలికగా అబద్ధాలు చెప్పే పద్ధతిని విడిచిపెట్టు. ఎందుకంటే తలకాసేదీ, తలకొట్టేదీ కూడ ఆ నాలుకే.

60. చెట్టిచ్చిన పండ్లను దిని
చెట్టును దెగనాడువాడు చెడుపోవు జుమీ
పెట్టిన చేతులనే తెగ
గొట్టినచో వాని బ్రతుకు కూలును శిష్యా!

తా. శిష్యా! చెట్టు ఇచ్చిన పళ్ళుతిని, ఆ చెట్టునే తిట్టేవాడు చెడిపోతాడు. పెట్టిన చేతులనే నరికితే వాడి బ్రతుకు కూలిపోతుంది.

61. ఆహెూ యోహెూలకు దా
సోహమ్మైపోదువేని అది పతనమ్మే
దేహము చెడు, గేహము చెడు
స్నేహము చెడు దుదకు నీవె చెడుదువు శిష్యా!

తా. శిష్యా! నీ చుట్టూ తిరుగుతూ నీవేమి చేసినా ఆహెూ ఓహెూ అంటూండే వారికి కనుకు నీవు దాసోహమైపోతే నీ దేహం చెడిపోతుంది. గేహం(ఇల్లు) చెడిపోతుంది. స్నేహం చెడిపోతుంది. చివరకు నీవే చెడిపోతావు.

62. నీ చుట్టును దిరిగినవా
రే చుట్టములంచు నెంచుటే దోషమ్మౌ
నీ చాటున నవ్వారల
యాచరణములేమొ తెలియుమయ్యా శిష్యా!

తా. శిష్యా! నీ చుట్టూ తిరిగేవారే నీ చుట్టాలనుకుంటే అది పొరబాటే. నీ చాటున వాంలా ప్రవర్తిస్తున్నారో తెలిసికో.

63. చప్పట్లు కొట్టు లోకమె
తప్పును గనుగొనిన నాడు దండించుజుమీ
నిప్పులతో జెలగాటము
తప్పునుమీ కాల్చివైచు దథ్యము శిష్యా!

తా. శిష్యా! నిన్ను, నీ ప్రతిభనూ చూసి లోకం చప్పట్లు కొడుతోందికదా అని మురిసిపోకు. నీలో ఏదైనా తేడా కనిపిస్తే అదే లోకం నిన్ను దండిస్తుంది. నిప్పులతో చెలగాటమాడడం తప్పు. తప్పకుండా అవి కాల్చేస్తాయి.

64. బలమిచ్చిన గర్వముతో
బలహీనునిపైని గోపపడి తిట్టినచో
బలహీను మనోవేదన
ప్రళయాగ్నిగ మారి కాల్చివైచును శిష్యా!

తా. శిష్యా! నీవు బలవం[illegible]ుడవనే గర్వంతో బలహీనుడిమీద కోపపడటం తిట్టటం వంటివి చే[illegible] అతడు నీమీద తిరగబడలేకపోవచ్చు. కాని అతని మనోవేదన ప్రళయాగ్నిగా మారి నిన్ను కాల్చేస్తుంది.

65. ఇలలో గలలో నిన్నే
తలచెడి తొలిహితుల వీడి తాత్కాలిక మి
త్రులకై యఱ్ఱులు చాచిన
ఫలమందదు తుదకు గూలబడెదవు శిష్యా!

తా. శిష్యా! నిద్రలోను, మెలకువలోనుకూడా నిన్నే తలచుకుంటూ మొదటినుండీ ఉన్న స్నేహితులను విడిచిపెట్టి, మధ్యలో వేరే మిత్రులకోసం ఆరాటపడితే ఆశించిన ఫలితం అందకపోగా చివరకు నీవే కూలబడిపోతావు.

66. అతిమాత్రపు లోభమ్మున
మితిమీరిన యాగ్రహమున మృగతుల్యముగా
బ్రతికెడి బ్రతుకొక బ్రతుకా
యతడొక చెదపురుగు మనుజుడగునా శిష్యా!

తా. శిష్యా! అతిగా లోభంతో(తనదికానిది తనకు కావాలనే కోరిక), హద్దులు దాటిపోయే కోపంతో పశువులా బ్రతికే బ్రతుకుకూడా ఒక బ్రతుకేనా? అటువంటివాడు మనిషికాడు చెదపురుగు.

67. ఎవరో శత్రువులనుకొని
యవమానము సేయబోకుమార్గురు శత్రుల్
నివసింతురు నీయందే
యవి చిక్కిన ధన్యజీవివగుదువు శిష్యా!

తా. శిష్యా! ఎవరినో జూచి వారు నీ శత్రువులనుకొని వారిని అవమానపఱచకు. నీలోనే ఆరుగురు శత్రువులున్నారు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు). ఆ శత్రువులు నీకు చిక్కితే నీవు ధన్యుడివౌతావు.

68. తొలినుండియు మురిపించిన
చెలిమి వెగటుపుట్టి క్రొత్త చెలిమికి మదిలో
నలజడి రేగినవానికి
బులకింతలు పోయి రోత పుట్టును శిష్యా!

తా. శిష్యా! మొదటినుండీ నిన్ను మురిపించిన స్నేహం వెగటుపుట్టి, క్రొత్తక్రొత్త స్నేహాలకోసం మనసులో అలజడి మొదలైతే కొంతకాలానికి ఆ స్నేహంలోకూడా పులకింతలు పోయి చివరకు రోతే మిగులుతుంది.

69. వెనుకన్ మొలిచిన కొమ్ములు
మొనదేరును జెవులు ముందు పుట్టినవయ్యున్
మొనదేరవు, శబ్దమ్మును
వినునవియే జ్ఞానమదియె వినుమా శిష్యా!

తా. శిష్యా! ముందు వచ్చిన చెవులకంటే వెనుక వచ్చిన కొమ్ములు మొనలుదేరుతాయి. చెవులకు మొనలు లేకపోవచ్చు గాని శబ్దాన్ని వినే శక్తి వాటికే ఉంటుంది. వినడం వల్లనే జ్ఞానం లభిస్తుంది. కొమ్ములు పొడవడానికి తప్ప ఎందుకూ పనికిరావు.

70. చెవులారగ వినకుండగ
నెవరో చెప్పినది నమ్మి హితజనములనే
యవమానపఱచువారికి
భువియందున బుట్టగతులు పుట్టవు శిష్యా!

తా. శిష్యా! చెవులారా వినకుండగా ఎవరో చెప్పిన చెప్పుడుమాటలను నమ్మి నీ హితాన్ని కోరుకొనేవారిని అవమానపరిస్తే అటువంటివానికి ఈ లోకంలో పుట్టగతులుండవు.

71. నమ్మినవారిని నమ్ముము
నమ్మకమును వమ్ము చేసి నడయాడకుమా
నమ్మినవారలకు నన
త్యమ్మాడెడివాడు హీనుడవనిన్ శిష్యా!

తా. శిష్యా! ఎవరు నిన్ను నమ్ముతారో వారినే నీవుకూడా నమ్మాలి. నమ్మినవారికి అబద్ధాలు చెప్పి మోసగించేవాడే ఈలోకంలో హీనుడు.

72. పాత్రులకు జిన్నపీట య
పాత్రులకును బెద్దపీట వైచితివేనిన్
గోత్రాభివృద్ధి యాగును
శత్రువగును మిత్రవరుడు సత్యము శిష్యా!

తా. శిష్యా! అర్హులైనవారిని అనాదరించి, అనర్హులను అందలమెక్కిస్తే ఆ పాపంవల్ల వంశం క్షీణిస్తుంది. గొప్ప మిత్రుడుకూడా శత్రువుగా మారిపోతాడు.

73. మాయయు మర్మమెఱుంగని
నీ యనుగుం జెలిమికాడు నీ మోసముచే
గాయపడిన నీ చరితకు
మాయనిదా మచ్చ కీర్తి మాయును శిష్యా!

తా. శిష్యా! మాయా మర్మం తెలియని నీ ప్రాణస్నేహితుడే నీవు చేసిన మోసంవల్ల మానసికంగా బాధపడితే అది నీ చరిత్రకే మాయని మచ్చ. దానివల్ల నీ కీర్తి మాసిపోతుంది.

74. ఆరాధించిన జనమే
నీరాజనమెత్తు జనమె నిను నిందించున్
నీ రంగు బయటపడుచో
చారిత్రము దప్పకుండ సాగుము శిష్యా!

తా. శిష్యా! నీవు చెడుగా ప్రవర్తిస్తూకూడా మంచివాడిలాగా నటిస్తే అది నిజమనుకొని నిన్ను ఆరాధించి, నీకు హారతులు పట్టినవారే నీ అసలు మోసం బయటపడిననాడు నిందిస్తారు. కాబట్టి నడవడిక తప్పుదారిన బడకుండా జీవించు.

75. ఏమియు నెఱుగనివారికి
నేమేమో చెప్పి, చెప్పి హితకర సుజన
స్తోమమ్మునుండి దూరము
గా మళ్ళించుటయ పాపకార్యము శిష్యా!

తా. శిష్యా! ఏమీ తెలియనివానికి ఏవేవో చెప్పుడుమాటలు అదేపనిగా చెప్పి, వానిని మేలు చేసే మంచివారినుండి దూరంగా పంపేస్తే అది పాపకృత్యము.

76. స్నేహితులను విడదీసిన
నా హృదయమునందు రగులు నతిభీకరమా
స్వాహాపతి నాలుకలకు
నాహారంబౌదువిది యథార్థము శిష్యా!

తా. శిష్యా! మిత్రులను విడదీస్తే ఆ గుండెలో రగిలే అతిభయంకరమైన అగ్నిజ్వాలలకు నీవు ఆహారమైపోతావు. ఇది నిజం.

77. పేదల నెత్తురు ద్రావుచు
సాధుజనుల బీడపెట్టి సంతోషింపం
గాదుసుమా రాబందున
కేదో యొక గాలివాన యేర్పడు శిష్యా!

తా. శిష్యా! పేదవారి రక్తం త్రాగుతూ, మంచివారిని బాధపెడుతూ సంతోషించడం తగని పని. ఎందుకంటే నూరు గొడ్లను తిన్న రాబందును ఏదో ఒకగాలివాని వచ్చి మట్టుపెడుతుంది.

78. అధికారబలము కలదని
మదమెక్కి చరింపబోకుమా! యెన్నటికేన్
మదమెండును, మై వంగును
గద! యప్పటి నీదు బ్రదుకు గనుమా శిష్యా!

తా. శిష్యా! నీకేదో అధికారబలం ఉందని పొగరుగా ప్రవర్తించకు. ఎందుకంటే కొంతకాలానికి ఆ పొగరు ఎండిపోతుంది. శరీరం వంగుతుంది. అప్పటి నీ బ్రతుకుగురించి కాస్త ఆలోచించు.

79. కొంచెము కనికరమేనియు
నించుకయేనియు వివేకమేర్పడకుండన్
లంచములు మేయునాడు న
శించును సంతానమటుల జెడకును శిష్యా!

తా. శిష్యా! ఏమాత్రం దయలేకుండా, ఏ కొంచెమూ జ్ఞానం లేకుండా అదేపనిగా లంచాలు తింటుంటే వాడి సంతానం నశించిపోతుంది. అలా చెడమ్.

80. ఎగసిపడు కెరటమెన్నడు
గగనమ్మును దాకబోదు, కాఱ్మొయిలెపుడున్
గగనమ్మును వీడిరాలదు
జగతీధర్మమునకెదురు జరుగదు శిష్యా!

తా. శిష్యా! కెరటం ఎంతగా ఎగసిపడినా అది నింగినంటదు. అలాగే నల్లనిమేఘం ఎప్పుడూ ఆకాశంనుండి నేలమీదికి రాలిపోదు. సృష్టిధర్మానికి విరుద్ధంగా ఏదీ జరుగదు.

81. పూటకు గడవని పేదల
నోటిపయిన్ గొట్టువాని నోటికి నెపుడో
వేటుపడు, గాలపాశము
మాటున గలదన్న మాట మఱవకు శిష్యా!

తా. శిష్యా! పూట గడవడమే కష్టంగా బ్రతికే పేదవారి నోటిమీద కొడితే నీ నోటిమీద కూడా వేటువేసేందుకు చాటుగా కాలపాశం పొంచే ఉంటుందన్న విషయాన్ని మఱచిపోకు.

82. ఎదురుగ గుణమును మెచ్చుచు
నెదురుగ లేనపుడు దోషమెంచెడివాడే
పొదమాటున నక్కిన పులి
ముదమున దరిజేర గొంపముంచును శిష్యా!

తా. శిష్యా! ఎదురుగా ఉన్నపుడు నీయంత గొప్పవాడు లేడంటూ గుణాలు మెచ్చుకొనేవాడే నీ వెనుక తప్పులను చూపిస్తున్నాడంటే అతడు పొదలో దాగిన పులి. దగ్గరకు వెడితే కొంప ముంచేస్తాడు.

83. కాటికి గాళ్ళను జాచియు
మాటికి దలపొగరు జూపు మత్తుండధముం
డేటికి గొఱగాడు సుమా
యేటికి నెదురీది మున్గుటే యగు శిష్యా!

తా. శిష్యా! జీవితంలో చరమదశకు వచ్చినా మాటిమాటికీ తలపొగరు చూపించే అహంకారి నీచుడు. వాడు ఎందుకూ పనికిరాడు. ఏటికి ఎదురీది చివరకు మునిగిపోతాడు.

84. భూషింపదగినవానిని
భూషింపగవలయుగాని స్వప్నమునందేన్
దూషింపరాదు సజ్జన
దూషకునకు నిహము పరము తూలును శిష్యా!

తా. శిష్యా! గౌరవింపతగినవారిని గౌరవించాలిగానికలలోకూడా దూషించకూడదు. సజ్జనులను దూషించేవాడికి ఈ లోకంలోనూ, పరలోకంలోనూకూడా సుఖంలేకుండా పోతుంది.

85. కన్నులు నెత్తికినెక్కిన
కన్నానక వాడె పడునుగానీ లోకం
బున్నట్లే యుండునులే
నిన్నాడినవాడె కూలు నేలకు శిష్యా!

తా. శిష్యా! కళ్ళు నెత్తికెక్కితే క్రింద కనబడక వాడే పడిపోతాడు తప్ప లోకం ఎప్పుడూ మామూలుగానే ఉంటుంది. అకారణంగా ఎవడైతే నిన్ను నిందిస్తాడో వాడే చివరికి కూలిపోతాడు.

86. అలుగుటయే యెఱుగనివా
డలిగినచో సాగరమ్ములన్నియు నొకటౌ
అలుగని శాంతుడు మెత్తని
పులి, డాయంబోయి గిల్లబోకుము శిష్యా!

తా. శిష్యా! ఎప్పుడూ కోపమంటే ఏమిటో తెలియనట్లుగా ఉండే పరమశాంతమూర్తికి కనుక కోపం వస్తే సముద్రాలన్నీ ఏకమైపోయినంత ప్రళయం వచ్చేస్తుంది. ఎప్పుడూ అలుగని శాంతమూర్తి మెత్తని పులివంటివాడు. మెత్తగా ఉన్నాడుకదా అని దగ్గరకు పోయి అనవసరంగా గిల్లకు.

87. పట్టుదల పెంకితనమును
బట్టున నీ జీవితమును బాడొనరించున్
పట్టు విడుపు లేకుండిన
నట్టేటను మునుగు బ్రతుకునావయు శిష్యా!

తా. శిష్యా! పట్టుదలా పెంకితనమూ నీ జీవితాన్ని పాడుచేసేస్తాయి. దేనికైనా పట్టు, విడుపు అనేవి ఉండాలి. అలా లేకపోతే, మొండిపట్టుదలతో ఉండేవాడి బ్రతుకునావ నట్టేటిలో మునిగిపోతుంది.

88. తిట్టినదానికి బదులుగ
దిట్టక మౌనముగ నున్న దిట్లాతనినే
కొట్టును, బడగొట్టును, వడి
నెట్టును బాతాళమునకు నిజముగ శిష్యా!

తా. శిష్యా! ఎవరైనా తిడితే తిరిగి తిట్టకుండా ఉంటే ఆ మౌనమే తిట్టిన వానిని కొడుతుంది. పడగొడుతుంది. అంతేకాదు వాడిని పాతాళానికి నెట్టేస్తుంది. ఇది నిజం.

89. ప్రారంభించిన పనులకు
ప్రారబ్ధముపేరు చెప్పి, వదలకుమెపుడున్
నూరారైనను బ్రజ్ఞా
ధీరుడవై పూర్తి చేసితీరుము శిష్యా!

తా. శిష్యా! పనులను ప్రారంభించి, మధ్యలో వదిలేసి, నా ప్రారబ్ధం ఇలా ఉందని సమర్థించుకోవాలని చూడకు. నూరు ఆరైనా సరే ప్రతిభ నీకందించిన ధైర్యంతో మొదలుపెట్టిన పనిని పూర్తి చేసితీరాలి.

90. తలలో నాలుకవలెనే
నలుగురితో గలిసిమెలిసి నడువగవలయున్
చెలిమిని దప్పిన దంత
మ్ములు నొక్కిన నాల్క బ్రదుకు మూడును శిష్యా!

తా. శిష్యా! తలలో నాలుక అంటే నోట్లో నాలుక 32 దంతాల మధ్య ఉండికూడా ఏ రెండు పళ్ళక్రింద పడి ఇరుక్కోకుండా అవి నమిలిపెట్టిన వాటి రుచులను ఆస్వాదిస్తుంది. అలా నలుగురితో కలిసిమెలిసి ఉంటూ వారినుండి పొందవలసిన ఉపకారాన్ని పొందాలి. నాలుక దంతాలతో శత్రుత్వం పెట్టుకుంటే, అవి ఒక్క నొక్కు నొక్కితే దాని బ్రతుకేమవుతుంది? అందుకని సంఘం మనకన్న బలమైనదని భావించాలి. అందరితో గొడవలు పెట్టుకుంటే మనలేవు.

91. అతివినయము చూపెడి ధూ
ర్తత కలిగిన దుష్టజనుల దరికి జనకుమా
అతిని ద్యజింపుము పూర్తిగ
మితమే యన్నింట గూర్చు మేలును శిష్యా!

తా. శిష్యా! అతివినయం ధూర్తలక్షణమ్ అన్నారు. అటువంటి దుష్టుల దగ్గరకు పోకు. నీవుకూడా ఏవిషయంలోనూ అతిగా వ్యవహరించకు. మితమే అన్నివిషయాలలోనూ మేలును కలిగిస్తుంది.

92. కొద్దియొ గొప్పయొ నేర్చిన
నొద్దికగా నుండవలయు నుద్ధతి యేలా!
చద్దిబలె గడుపునం బడు
నుద్దులకుం జల్లదనమె సుగుణము శిష్యా!

తా. శిష్యా! కొద్దిగానో, గొప్పగానో పాండిత్యాన్ని సంపాదిస్తే, మరింత వినయంగా ఉండాలిగానీ, గర్వంతో మిడిసిపడటం ఎందుకు. విద్య చద్దన్నంలాంటిది. కడుపులో పడ్డాక చల్లదనాన్నే ఇవ్వాలి. అదే మంచిగుణం.

93. నరులకు నరులే శత్రువు
లరెరే! పులి పులిని జంపునే యెటనేనిన్
వరుసగ బాంబులు ప్రేల్చుచు
నరుడాయెను రాక్షసుండు న్యాయమె శిష్యా!

తా. శిష్యా! మనుష్యులకు మనుష్యులే శత్రువులైపోయారు. ఎక్కడైనా పులి మరొక పులిని చంపుతుందా? కాని మానవుడు వరుసగా బాంబులు పేలుస్తూ తోటి మనుష్యులనే చంపేస్తూ రాక్షసుడిగా మారిపోయాడు. ఇది న్యాయమేనా!

94. మగువల మానప్రాణా
లొగి దీసెడి గీచకాళి యుర్విన్ నిండెన్
దెగబలిసిన మగపశువుల
దిగజారిన మనసు మార్చి దిద్దుము శిష్యా!

తా. శిష్యా! స్త్రీల మానప్రాణాలు రెండూ హరించే కీచకులు నేలపై పెరిగిపోయారు. వారు తెగబలిసిన మగపశువులు. దిగజారిపోయిన వారి మనసు మార్చి, మంచివారిగా తీర్చి దిద్దు.

95. నిగమమ్ములో! శాస్త్రమ్ములో!
యగణితమగు గవనగుణమొ! స్వాధీనముగాన్
జగమే తనదన్నట్లుగ
బొగరెక్కుచు బ్రేలువాడు మూర్ఖుడు శిష్యా!

తా. శిష్యా! వేదాలో, శాస్త్రాలో, గొప్ప కవితాశక్తియో స్వాధీనమైనంత మాత్రాన ఈ ప్రపంచమే తనదన్నట్లుగా పొగరెక్కి ప్రేలేవాడు మూర్ఖుడు.

96. కొన్ని దశాబ్దములుండెద
వన్నన్నా! దీనికే యహంకారంబా!
నిన్ను బయికెత్తువారిని
మన్నించుట ధర్మమనుచు మఱవకు శిష్యా!

తా. శిష్యా! ఎవరైనా ఎంతకాలం జీవిస్తారు? కొన్ని దశాబ్దాలే తప్ప శతాబ్దాలతరబడి ఎవరూ బ్రతుకరు గదా! ఆపాటిదానికి అహంకారం ఎందుకు? ఎవరైతే నీవు ఎదగడానికి ఊతమిస్తారో అటువంటివారిని మన్నించడం ధర్మమనే సంగతి మర్చిపోకు.

97. నిను మించినవారెందరొ
మునుపుండిరి యుండిరిపుడు పుట్టుదురికపై
నిను నీవెఱుగని జ్ఞానము
కనుపాపకు నోచుకోని కన్నే శిష్యా!

తా. శిష్యా! నీవు తెలివైనవాడివే కావచ్చు. కాని నిన్ను మించినవారెందరో ఇంతకు ముందు ఉన్నారు. ఇప్పుడూ ఉన్నారు. ఈ పైన పుడతారుకూడా. నిన్ను నీవు తెలిసికోలేని జ్ఞానం(ఆత్మజ్ఞానం) కనుపాప లేని కన్నులాంటిది. దానివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు.

98. కన్నానదు, కాలాడదు
పన్నుండదు, తిన్న తిండి పచనముకాదే
యన్నన్న పొగరుమాత్రము
మిన్నంటుట కలుగనీదు మేలును శిష్యా!

తా. శిష్యా! వయసు పైబడుతుంటే కన్ను సరిగా కనబడదు. నడిచేందుకు కాలు సరిగా సహకరించదు. గట్టిగా తిందామంటే దంతాలుండవు. తిన్నది అరగదు. ఇలా శరీరం శిధిలమైపోతున్నా పొగరుమాత్రం ఆకాశాన్నంటుతుంది. అటువంటి నడత ఎంతమాత్రం మేలు కలిగించదు.

99. దున్నీనినదను మాటను
విన్నంతనె దూడ గట్టివేయుము త్వరగా
నన్నట్లుగ బ్రదుకకుమా
మున్నుగ నిజమేదొ తెలియబూనుము శిష్యా!

తా. శిష్యా! దున్నపోతు ఈనిందంటే వెంటనే దూడను కట్టేయమన్నట్లుగా బ్రతుకరాదు. ముందుగా నిజమేదో తెలిసికోవడానికి ప్రయత్నించు.

100. బెత్తము గొని పొత్తముపై
జిత్తము మళ్ళించి, నీదు జీవితమెల్లన్
బుత్తడిగ మార్చు గురువును
బత్తిని బూజింపుమదియె భద్రము శిష్యా!

తా. శిష్యా! చేతిలో బెత్తం పట్టుకొని పుస్తకంపైకి నీ మనసును మళ్ళించి, నీ జీవితాన్ని బంగారంగా మార్చే గురువును భక్తిగా పూజించాలి. అదే జీవితానికి మంగళాన్ని కలిగిస్తుంది.

101. రూకలు వచ్చును జదివిన
రూకలతో జదవు కొనెడి రోజులు వచ్చెన్
లోకపు పోకడ గనుమా
రూకకు జదువన్న నెంత లోకువ శిష్యా!

తా. శిష్యా! చదువుకుంటే డబ్బు సంపాదించుకోవచ్చు. కాని డబ్బుతో చదువు కొనుక్కునే రోజులు వచ్చాయి. లోకం తీరు గమనించు. రూపాయికి చదువు ఎంతో లోకువైపోయింది.

102. గురుకులములు పోవుట, కుల
గురువులు మితి మీఱుచుంట కువలయమందున్
గురుశిష్యబంధమునకే
గురుతులు చెరిగినవి తెలిసికొమ్మిది శిష్యా!

తా. శిష్యా! ప్రపంచంలో గురుకులాలు పోవడం, కులగురువులు పెరిగిపోవడంవల్ల గురుశిష్యబంధానికే గురుతులు చెరిగిపోయాయి. ఈవిషయాన్ని గ్రహించు.

103. చదువందించినవానిని
వదలిన జుక్కాని విడిచి పడవ నడుపుటే
అదిగాక గురుద్రోహం
బుదధి దిమింగలము నోట నురుకుట శిష్యా!

తా. శిష్యా! చదువును నీకందించినవానిని విడిచిపెట్టేయడమంటే చుక్కానిని విడిచిపెట్టి పడవ నడపడంలాంటిది. అదిగాకుండా గురుద్రోహం చేయడానికే సమకడితే సముద్రంలో తిమింగలం నోట్లోకి ఉరికేయడమే.

104. గురుధిక్కారము సేసిన
కురునాథుడు మట్టిగఱచె, గురువందన బం
ధురుడై విజయుండాయెను
నరుడాతని వలెనె నీవు నడువుము శిష్యా!

తా. శిష్యా! దుర్యోధనుడు గురునింద చేసాడు. నేలకూలాడు. అర్జునుడు గురువందనమాచరించాడు. యుద్ధంలో విజయాన్ని పొందాడు. నీవు అర్జునునిలా జీవించు. దుర్యోధనునిలా కాదు.

105\. గోటన్ బోయెడిదానికి
మోటుగ గొడ్డలిని బట్టి పోరకుమెపుడున్
మాటకు మాటయె తెగులగు
నీటికి తెగులగును నాచు నిజముగ శిష్యా!

తా. శిష్యా! గోటితో పోయేదానికి మూర్ఖంగా గొడ్డలిని పట్టి పోరాటం చెయ్యకు. నీటికి నాచు తెగులు, మాటకు మాట తెగులు అన్నది నిజం.

106\. హితవాక్యము ప్రియవాక్యము
జతగూడవు హితులతోడ జతకట్టవలెన్
హితులను బయటకు నెట్టిన
క్షతి కలుగును రావణుండు సాక్షిర శిష్యా!

తా. శిష్యా! మేలు కలిగించే మాట వేరు. ఆనందాన్ని కలిగించే మాట వేరు. ఈ రెండింటికీ జత కుదరదు. ప్రియవాక్యాలు చెప్పే వారిని మన్నించి, హితం చెప్పేవారిని బయటకు నెడితే నాశనం తప్పదు. దానికి విభీషణుని బయటకు నెట్టిన రావణుడే సాక్షి.

107\. ప్రాతను గర్హింపకుమా
రోతయనుచు, నేడు నీకు గ్రొత్తయయినదే
ప్రాతయగు గొన్నినాండ్లకు
బూతమెఱుంగులకు మోసబోకుము శిష్యా!

తా. శిష్యా! ప్రాతను రోత అంటూ నిందించకు. ఈరోజు నీకు క్రొత్తగా అనిపించినదికూడా కొన్నాళ్ళకు ప్రాతబడుతుంది కదా! పైపై మెఱుపులు చూసి మోసపోకు.

108\. జ్ఞానముతో జీవించుము
జ్ఞానమునకు మూలమొక్క సత్యమె సుమ్మీ
ధ్యానింపుము తత్త్వమ్మును
ప్రాణము సుఖముండు మంగళంబగు శిష్యా!

తా. శిష్యా! జ్ఞానంతో జీవించు. జ్ఞానానికి మూలం సత్యమే. తత్త్వాన్ని(అసలు మూలాన్ని) ధ్యానించు. అప్పుడు నీ ప్రాణం సుఖంగా ఉంటుంది. మంగళం కలుగుతుంది.

ఇది కౌండిన్య సగోత్రుండును, కడిమిళ్ళ వంశసఞ్జాతుండును,
బుచ్చమాంబాశేషయదంపతుల పౌత్రుండును,
భారతీవేఙ్కటరామయశాస్త్రిదంపతుల పుత్రుండును, రమేశ విరిఞ్చినామక
కవిద్వయ జనకుండును, మీనాక్షీనామక కవయిత్రీవల్లభుండును,
సంగమేశ్వరశతకము, చిన్తామ్బికాష్టకమ్, మధుజీవనము, మనజాతి,
తాంబూలము, త్యాగసింధువు, అమృతవర్షిణి, పెంపుడు చిలుక,
ఏడుచేపలు, గురువన్దనమ్, అహఙ్కారశతకము, దాసోహమ్, గాణ్డీవము,
మనశ్శాన్తిశతకమిత్యాది బహుకృతినిర్మాతయు ప్రతిభాసముపేత
బహుశిష్యసంపన్నుండునగు గురుసహస్రావధాని వరప్రసాద
ప్రణీతంబయిన పంచదశ కృతి శిష్యశతకము సర్వము సమాప్తము.



కుటుంబ చిత్రం



పద్యమ్మునెవడురా పాతిపెట్టెదనంచు
ఉన్మాదియై ప్రేలుచున్నవాడు
పద్యమ్మునెవడురా ప్రాతవడ్డదియంచు
వెఱ్ఱివాడై విఱ్ఱవీగువాడు
పద్యమ్ము ఫలమురా పాతిపెట్టిన బెద్ద
వృక్షమై పండ్ల వేవేల నొసగు
పద్యమ్మునెప్పుడో పాతిపెట్టితిమేము
లోకుల హృదయాల లోతులందు

ఇప్పుడద్దాని పెకలింప నెవరితరము
వెలికితీసి పాతుట యెంత వెఱ్ఱితనము
నిన్నటికి మున్ను మొన్ననే కన్ను దెఱచు
బాల్యచాపల్యమునకెంత వదఱుతనము

గురుసహస్రావధాని
డా. కడిమిళ్ళ వరప్రసాద్

సాయితేజ ప్రింటర్స్, నర్సాపురం.
సెల్ : 9346633812